సామిల్లు, టింబర్ డిపోల తనిఖీ

- రెండింటిలో ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించడంలేదని గుర్తింపు
- నోటీసులు జారీ చేసిన ఫైర్ ఆఫీసర్ రాజయ్య

దేవి టింబర్ డిపో యజమానికి నోటీసులు ఇస్తున్న ఫైర్ ఆఫీసర్

హుజూరాబాద్, జూన్ 1: సామిల్లులు, టింబర్ డిపోలలో ఫైర్ సేఫ్టీ నిబంధనల ఉల్లంఘనపై మే 31న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అగ్నిమాపక శాఖ అధికారులు స్పందించారు. శనివారం వరంగల్ రోడ్డులోని శ్యామల సామిల్లుతో పాటు దేవి టింబర్ డిపోలను ఫైర్ ఆఫీసర్ రాజయ్య తనిఖీ చేశారు. వాటిలో ఎలాంటి ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని గుర్తించి నోటీసులు జారీ చేశారు. దేవి టింబర్ డిపో పెట్రోలు బంక్ పక్కనే ఉండగా, ఏదైనా ప్రమాదం జరిగితే మంటలను అదుపులోకి తేవడం కష్టతరంగా ఉంటుందని ఫైర్ ఆఫీసర్ పేర్కొన్నారు. సదరు డిపో యజమాని ఫైర్ సేఫ్టీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. మండల పరిధిలోని ప్రతి సామిల్లు, టింబర్‌డిపోల యజమానులు నిర్లక్ష్యం వీడి ఫైర్‌సేఫ్టీకి సంబంధించి పరికరాలు అమర్చుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఇతరసిబ్బంది ఉన్నారు.

మల్లారపు రత్నాకర శర్మ కన్నుమూత

రత్నాకర శర్మ(ఫైల్)

కమాన్‌చౌరస్తా, జూన్ 1 : కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయుడు మల్లారపు రత్నాకరశర్మ(80) శనివారం ఉదయం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. 40 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేసిన ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సంగీత రంగంలో గణపతి సచ్చిదానందస్వామి శిష్యుడిగా పేరు గాంచిన రత్నాకర శర్మ.. స్వామీజీ నెలకొల్పిన సచ్చిదానంద కళాపీఠానికి అధ్యక్షుడిగా సేవలందించారు. గతంలో కరీంనగర్‌లో జరిగిన అన్నమయ్య సహస్ర గళార్చనకు మిరాకిల్స్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధిగా హాజరయ్యారు. రత్నాకర శర్మ మృతికి అన్నమయ్య ఆరాధనా అసోసియేషన్ బాధ్యులు కేబీ శర్మ, చిలకపాటి హనుమంతారావు, గోగుల ప్రసాద్, కడార్ల సుదర్శన్, నృత్య శిక్షకుడు రంగాచార్యులు, కవులు డాక్టర్ గంధ్ర లక్ష్మణరావు, దాస్యం సేనాధిపతి, గాజుల రవీందర్, కేఎస్ అనంతాచార్య, యోగా సంపత్ కుమార్, కాండూరి వెంకటేశ్వర్లు, జానపద కళాకారుడు జీ కృపాదానం, అప్పాజీ శిష్య బృందం సంతాపాన్ని తెలిపింది.

బాధిత కుటుంబాలకు చాడ పరామర్శ

చిగురుమామిడి, జూన్ 1: రేకొండ గ్రామంలో ఇటీవల దుడ్డెల మల్లికాంబ, జన్నూరి శ్రీనివాస్, మేకల మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం వారి కుటుంబాలను సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. పార్టీ సిద్ధాంతాల కోసం కంకణ బద్ధులై, ప్రజా సమస్యలపై ఉద్యమించిన నాయకులకు శాశ్వత గుర్తింపు ఉంటుందన్నారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్మిక సభ్యుడు బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని పటేల్, మాజీ ఎంపీటీసీ పరకాల కొండయ్య, సీపీఐ మాజీ గ్రామ కార్యదర్శి తమ్మిశెట్టి రవీందర్, నాయకులు తమ్మిశెట్టి ప్రవీణ్, విలాసాగరం అంజయ్య తదితరులున్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

గంగాధర, జూన్ 1 : వడదెబ్బతో వృద్ధురాలు మృతి ఘటన శనివారం మండలంలో జరిగింది. మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన చిందం అన్నవ్వ(86) రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నది. శుక్రవారం రాత్రి అందులోనే నిద్రించిన వృద్ధురాలిని శనివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మరణించింది. కాగా, ఎండవేడి ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగిలి అన్నవ్వ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


హుజూరాబాద్: పాటిమీది ఆంజనేయస్వామి ఆలయంలో నాయకులు, భక్తులతో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ఇల్లందకుంట: శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మాలవిరమణ చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

ఘనంగా హనుమాన్ జయంతి

- జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి
- ఇల్లందకుంట దేవాలయంలో దీక్షాపరుల మాల విరమణ


నగరంలోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మేయర్ వై సునీల్‌రావు

కమాన్‌చౌరస్తా/ ఇల్లందకుంట/ హుజూరాబాద్/ రూరల్/ చొప్పదండి/ శంకరపట్నం, కరీంనగర్ రూరల్, జూన్ 1: హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. జిల్లా కేంద్రంలోని హెలీప్యాడ్ మైదానం, కశ్మీర్‌గడ్డలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలను మేయర్ యాదగిరి సునీల్ రావు సందర్శించారు. భగత్‌నగర్ అంజనాద్రిపై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో సాయంత్రం సామూహిక విష్ణుసహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఇక్కడ చిలకపాటి హనుమంతరావు పాల్గొన్నారు. రాంనగర్ రమాసత్యనారాయణస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, చైర్మన్ చల్ల హరికృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత, లేబర్‌అడ్డా భక్తాంజనేయస్వామి ఆలయాల్లో ఈవో అనిల్ కుమార్, క్లర్క్ మహేశ్, కొండయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదర్శనగర్ రాజరాజేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మెతుకు కనకయ్య, భూమి రెడ్డితో పాటు మల్లయ్య, రమణ, మనోహర్, జయలక్ష్మి, స్వాతి, సుజాత, శ్రీవేణి, లత, వినోద, సరిత, వీణ, రమ, భారతి, సుజాత పాల్గొన్నారు. అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం అంజన్న దీక్షాపరులు, భక్తులతో కాషాయ శోభను సంతరించుకున్నది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్టుకు అర్చనలు, ప్రత్యేకాభిషేకాలు చేశారు. దేవాలయంలో ఐదువేల మంది దీక్షాపరులు మాలవిరమణ చేశారు. ఏర్పాట్లను ఈవో కందుల సుధాకర్, దేవాలయ సిబ్బంది పర్యవేక్షించారు. హుజూరాబాద్ పట్టణంలోని, రంగనాయకుల గుట్టవద్ద గల ఆంజనేయస్వామి ఆలయాలను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, శ్రీనివాస్ దంపతులు సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు ముత్యంరాజు, తాళ్లపెల్లి శ్రీనివాస్, నాయకులు కొలిపాక శ్రీనివాస్, కళ్లెపు అఖిల్ తదితరులున్నారు. తుమ్మనపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి పట్టణంలో షిర్డీసాయి భజనమండలి ఆధ్వర్యంలో సత్సంగ్, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కేశవపట్నం హనుమాన్ ఆలయంలో గీతాపారాయణం, హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. హనుమాన్ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తనుకు ఓంకారం, పాలడుగుల బాబన్న, కర్మకొండ రాజయ్య, తనుకు సత్యనారాయణ, అల్లెంకి మనోహర్, పెద్ద సంఖ్యలో హనుమాన్ దీక్షాపరులు దర్శించుకున్నారు. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని పంచముఖ హనుమాన్ పీఠంలో పరబ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్రావతరణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టరేట్

కలెక్టరేట్, జూన్ 1: రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనుండగా, 9.02 గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. 9.10 గంటలకు వందన స్వీకారం, 9.17 గంటలకు కలెక్టర్ సందేశం, 9.30 గంటలకు తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్ తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్‌యూను సందర్శించిన ఇన్‌చార్జి వీసీ

ఇన్‌చార్జి వీసీ సురేంద్ర మోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కమాన్‌చౌరస్తా, జూన్ 1 : శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన గనులు భూగర్భ శాఖ కార్యదర్శి, టీజీ ఎండీసీ ఎండీ సురేంద్ర మోహన్ శనివారం మధ్యాహ్నం యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు రిజిస్ట్రార్ వరప్రసాద్, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరంగ ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం వీసీ యూనివర్సిటీలోని పలు విభాగాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యూనివర్సిటీ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని ఆయన సూచించినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం జరుగనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించనున్నారు.

శ్రీ చైతన్య అధ్యాపకురాలికి డాక్టరేట్

అధ్యాపకురాలిని అభినందిస్తున్న చైర్మన్ రమేశ్ రెడ్డి

తిమ్మాపూర్, జూన్1: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఉషా భవానికి నల్లగొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి పర్యవేక్షణలో 'ఎక్సిస్టెన్స్ ఆఫ్ ఫిక్స్డ్ పాయింట్ తీరమ్స్ ఫర్ వేరియస్ కాంట్రాక్టివ్ మ్యాపింగ్ ఇన్ మెట్రిక్ స్పేస్ విత్ అప్లికేషన్స్' అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. శనివారం కళాశాల ఆవరణలో అధ్యాపకురాలిని విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ రాజు, హెచ్‌వోడీ గుర్రం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

కిట్స్ అధ్యాపకుడికి..

మహేందర్‌రావు

హుజూరాబాద్ రూరల్, జూన్ 1: సింగాపూర్ కిట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు అర్షపెల్లి మహేందర్‌రావుకు చైతన్య డీమెడీ టబ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ దోమల సురేశ్ పర్యవేక్షణలో 'సింతేసిస్ అండ్ క్యారెక్టరీజషన్ ఆఫ్ పాలిమర్ మెటల్ కాంప్లెక్స్ హైబ్రిడ్ ఫొటో కాటలిస్ట్స్ ఫర్ డిగ్రాడేషన్ ఆఫ్ ఆర్గానిక్ పొల్లుటెంట్స్' అంశంపై ఆయన చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు చైతన్య డీమెడీ టబ్ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జగదీశ్వర్ ప్రకటనలో తెలిపారు. మహేందర్‌రావును కిట్స్ డైరెక్టర్ డాక్టర్ కే శంకర్, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సెక్రటరీ సతీశ్‌కుమార్, హ్యూమానిటీస్ విభాగాధిపతి, రిజిస్ట్రార్ వీ రాజేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

సొసైటీల ఎన్నికలకు త్వరలో ప్రకటన విడుదల

కలెక్టరేట్, జూన్ 1: జిల్లాలోని మూడు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, ఒక గొర్ల పెంపకందారుల సహకార సంఘానికి త్వరలోనే ఎన్నికల ప్రకటన వెలువరించనున్నట్లు జిల్లా సహకార అధికారి ఎస్.రామానుజాచార్య తెలిపారు. 6 నుంచి 28 తేదీల మధ్య ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. పదవీకాలం ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాలు 60 రోజుల ముందుగానే ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాతో ఎన్నికల ప్రతిపాదనలు రాష్ట్ర సహకార ఎన్నికల ప్రాధికార సంస్థకు సమర్పించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

నూతన నియామకం

హుజూరాబాద్ రూరల్, జూన్ 1: ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి-ఇందిరానగర్ గ్రామానికి చెందిన కొలుగూరి సూర్య కిరణ్‌ను నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. తనను కన్వీనర్‌గా నియమించిన బండ సురేందర్ రెడ్డితో పాటు సహకరించిన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, హకీమ్, నవీద్‌కు సూర్య కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

రూ.లక్ష బీమా చెక్కు అందజేత

విద్యానగర్, జూన్ 1 : గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కరీంనగర్ శాఖ ఖాతాదారు (నిర్భయ సేవింగ్) కాశిపాక శంకర్ ప్రమాదవశాత్తు మృతి చెందగా, శనివారం అతడి భార్య శంకరవ్వకు రూ.లక్ష బీమా చెక్కును మేయర్ వై సునీల్ రావు చేతుల మీదుగా అందించినట్లు బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కనీస డిపాజిట్లతో ఖాతాదారులకు కల్పిస్తున్న బీమా సౌకర్యం పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా ఇస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

చొప్పదండి, జూన్ 1: చొప్పదండి మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే నిబంధనలు పాటించని సదరు కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో చేపట్టిన డివైడర్ నిర్మాణంతో రోడ్డు ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులను అప్రమత్తం చేసేలా ఎక్కడా కూడా కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

హుజూరాబాద్ రూరల్, జూన్ 1: రంగాపూర్ గ్రామంలోని జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దీరావత్ రాకేశ్ (17) మృతి చెందాడు. జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం గిద్దెబండ తండా గ్రామానికి చెందిన దీరావత్ రాకేశ్ తన స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు బయలుదేరగా, రంగాపూర్ గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, హనుమకొండలో ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి దీరావత్ జవహర్‌లాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు,

చికిత్స పొందుతూ..

వీణవంక, జూన్ 1: వేధింపులు భరించలేక పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. బొంతుపల్లి గ్రామానికి చెందిన చదువు వాసుదేవరెడ్డి (50)ని అదే గ్రామానికి చెందిన చదువు నరసింహారెడ్డి, కోరగంటి శారద, కోరుగంటి ఓదెలు, జున్నూతుల మనోహర్‌రెడ్డి, జున్నూతుల మంజుల, కోరుగంటి శంకర్ పాత పగలు మనసులో పెట్టుకొని వేధింపులకు గురి చేశారు. వేధింపులు భరించలేక వాసుదేవరెడ్డి గత నెల 25న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. వాసుదేవరెడ్డి కుమారుడు వినయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

హుజూరాబాద్ రూరల్, జూన్ 1: మున్సిపల్ పరిధిలోని అహల్యనగర్‌కు చెందిన ముగ్ధంపురం అనిల్ కుమార్ (33) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. హుజూరాబాద్‌లోని సూపర్ బజార్ రోడ్డులో గల కొబ్బరికాయల దుకాణంలో పనిచేస్తున్న అనిల్ కుటుంబ కలహాలతో క్షణికావేశంలో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి అనిల్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

తెలంగాణచౌక్, జూన్ 1: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని తెలంగాణ గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందబోయిన ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్త సమావేశంలో అయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావస్తున్నా ఇప్పటివరకు కనీసం పశుసంవర్ధక శాఖకు మంత్రిని నియమించలేదని విమర్శించారు. గొర్రెలు మేకల పంపిణీ స్కీంలో స్కాం పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. గొల్ల కురుమ, యాదవ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించకపోవడంతో గొల్ల కురుమలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరిపై ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

సీఎండీ గారూ.. ఏమిటీ దుస్థితి?

ప్రధాన రహదారిపై వదులుగా మారిన తీగలు, ప్రమాదకరంగా వేలాడుతున్న రాళ్లు (ఇన్‌సెట్‌లో)

ముకరంపుర, జూన్ 1: విద్యుత్ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే దిశగా ఎన్పీడీసీఎల్ సీఎండీ చర్యలు తీసుకుంటుండగా క్షేత్ర స్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. రేకుర్తి అంబేద్కర్ చౌరస్తా నుంచి శాతవాహన యూనివర్సిటీకి వెళ్లే మార్గంలో లయోల విద్యాసంస్థ వద్ద నెలకొన్న పరిస్థితే ఇందుకు నిదర్శనం. ప్రధాన రహదారిపై ఉన్న లైన్‌లో తీగలు వదులుగా మారడంతో చిన్నపాటి గాలికే తాకుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాల్సిన సిబ్బంది తీగలు గాలికి ఒకదానికొకటి తగలకుండా లైన్‌కు పెద్ద పరిమాణంలో కంకర రాళ్లను కట్టి చేతులు దులుపుకొన్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వైర్లకు వేలాడదీసిన రాళ్లు ప్రమాదకరంగా మారాయి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.. కేసు నమోదు

వీణవంక, జూన్ 1: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా జమ్మికుంటకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను నర్సింగాపూర్ గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటి యజమానులు పోతిరెడ్డిపల్లికి చెందిన రమేశ్, అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

'చల్లని' సేవకు సలాం

- మండుటెండల్లో దాహార్తి తీరుస్తున్న చలివేంద్రాలు
- ఏటా సామాజిక బాధ్యతగా నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు

కరీంనగర్ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి చలివేంద్రం

మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తిని తూచా తప్పక పాటిస్తూ వివిధ స్వచ్ఛంద సంస్థలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ముఖ్యంగా మండుటెండల్లో నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్టాండ్ నుంచి ప్రయాణిస్తున్న వారికి చల్లటి నీరందిస్తూ సేవాభావాన్ని చాటుతున్నాయి.

-తెలంగాణచౌక్, జూన్ 1

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి ప్రతి రోజు వివిధ ప్రాంతాలకు సుమారు లక్ష మంది ప్రయాణిస్తుంటారు. బస్టాండ్‌లోని స్టాళ్లలో వాటర్ బాటిల్స్ విక్రయాలు జరుగుతున్నప్పటికీ డబ్బులు వెచ్చించే స్థోమత లేని సామాన్యుల కోసం స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. బస్టాండ్ ఆవరణలో ప్రాంగణం ముందు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో, బస్టాండ్ ఎదుట సఫా బైతుల్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఎండ తీవ్రత తగ్గే వరకు తాగునీరు అందజేస్తున్నారు. రోజు రెండు వేల లీటర్ల మినర్ వాటర్‌ను ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతున్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలోని చలివేంద్రంలో ఐదుగురు సేవకులు షిఫ్టుల వారీగా విధులను నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో ఈ చలివేంద్రాన్ని ఆర్టీసీ అధికారుల చేతుల మీదుగా ప్రారంభించి వర్షాలు కురిసే వరకు కొనసాగిస్తున్నారు. ప్రయాణికులతోపాటు ఆటో డ్రైవర్లు, సమీపంలోని దుకాణాదారులు, యాచకులు ఆయా చలివేంద్రాల మీద ఆధాపడి దాహార్తిని తీర్చుకుంటున్నారు. చల్లటి మంచినీటిని అందిస్తూ సేవాభావాన్ని చాటుతున్న చలివేంద్రాల నిర్వాహకులను ప్రయాణికులు అభినందిస్తున్నారు.

25 ఏండ్లుగా నిర్వహిస్తున్నం

'మానవ సేవే మాధవ సేవ' అన్న శ్రీసత్యసాయి బాబా సూక్తితో ప్రజలకు సేవలందిస్తున్నం. 25 ఏండ్లుగా ప్రతి వేసవిలో కరీంనగర్ బస్టాండ్‌లో సేవా సంస్థ ద్వారా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నం. గత వేసవిలో రోజు వెయ్యి లీటర్ల మినరల్ వాటర్‌ను ప్రయాణికులకు అందించాం. ఈ సారి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రతి రోజూ రెండు వేల లీటర్ల మంచినీటి అందుబాటులో ఉంచుతున్నం. కరీంనగర్‌తో పాటు జమ్మికుంటలో రె